క్లుప్తంగా

101 మందికి వైద్య పరీక్షలు



కూచిపూడి(మొవ్వ): స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మొవ్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలోని కూచిపూడి సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 101 మందిని పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. నిడుమోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ రోగులను పరీక్షించారు. ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు.

నమ్మితాలగుంట రోడ్డుకు మరమ్మతులు

పమిడిముక్కల: ఎట్టకేలకు కూడేరు శివారు నమ్మితాలగుంట రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డంతా పూర్తిగా ధ్వంసమై గుంతలు పడి ఉంది. వర్షం పడితే రోడ్డంతా బురదమయంగా మారుతుంది. నమ్మితాలగుంట ప్రజలు నిత్యం అలీనఖీపాలెం మీదగా చోరగుడి వెళ్లాల్సి ఉంది. విద్యార్థులు హైస్కూల్‌కు చోరగుడికి వెళ్లాల్సి ఉంది. కొన్నేళ్లుగా రహదారిని బాగుచేయాలని నమ్మితాలగుంట వాసులు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతూనే ఉన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సూచనల మేరకు రహదారి మరమ్మతులకు మండల పరిషత్ నుంచి రూ.3 లక్షల నిధులు కేటాయించారు. ఈ నిధులతో రహదారి పాడైపోయిన చోట జీఎస్‌బీ రోడ్డు వేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులను కృష్ణాపురం పీఏసీఎస్ చైర్మన్ రాజులపాటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్ గంగాశ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

నేటి నుంచి రైల్వే గేట్ మూసివేత

మండవల్లి: రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఎల్‌సీ నంబరు–79 కైకలూరు–గుడివాడ రైల్వే గేట్‌ను ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు మూసివేయనున్నారు. ఈ మేరకు కైకలూరు రైల్వే అధికారి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక



గుడివాడ టౌన్: గుడివాడ టూ వీలర్ మెకానిక్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని కిన్నెర కాంప్లెక్స్‌లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన పాలకవర్గ ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా చెరుకూరి శ్రీనివాసరావు గౌరవాధ్యక్షుడిగా అన్సారి, కార్యదర్శిగా సింహాచలం, కోశాధికారిగా పి. మధు ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని కొల్లూరు మెకానిక్‌లు తదితరులు అభినందించారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

కైకలూరు: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ వద్దని ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ పేర్కొన్నారు. కైకలూరు సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు, కొల్లేటికోట పీహెచ్‌సీలో డాక్టర్ హేమంత్ అధ్యక్షతన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. కైకలూరులో 250, కొల్లేటికోటలో 191 మందికి బీపీ, షుగర్, స్త్రీ సంబంధిత పరీక్షలు, ఎముకలు, చెవి, కంటి, ముక్కు తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమాల్లో కైకలూరు సీహెచ్‌సీ చైర్మన్ రమణ, సభ్యులు తానా ప్రసాద్, మన్నె శ్రీనివాసరావు, జనరల్ సర్జరీ డాక్టర్ కె.శ్వేత, గైనకాలజిస్ట్ డాక్టర్ పి. బాల ప్రసూనాదేవి, గైనకాలజిస్ట్ డాక్టర్ వి.సునీత, ఆప్తమాలజీ డాక్టర్ పి.రమాదేవి, చెవి ముక్కు గొంతు డాక్టర్ కరిష్మా బేగం తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం



పామర్రు బుచ్చమ్మ ఆశ్రమంలోని పర్వతవర్ధనీదేవికి గాయత్రీమాత



పామర్రులో గాయత్రీదేవిగా అంకమ్మతల్లి అమ్మవారు



వేమవరంలో గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ



డోకిపర్రులో ధాన్యలక్ష్మీ దేవిగా..



మండవల్లి మల్లేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవిగా..

పామర్రు: దేవీ శరన్నవరాత్రులలో భాగంగా రెండో రోజు మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవార్లను వేదమాత గాయత్రీదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారిని, బుచ్చమ్మ ఆశ్రమంలోని రామలింగేశ్వరస్వామి సమేత పర్వతవర్ధనీ దేవి అమ్మవార్లను గాయత్రీ దేవిగా అలంకరించారు. కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం, అంకమ్మ తల్లి ఆలయంలో భక్తులతో కుంకుమ పూజ నిర్వహించారు. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని మంగళ గౌరిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను భక్తి శ్రద్ధలతో కొలిచారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: దసరా నవరాత్రుల్లో భాగంగా వేమవరం శ్రీ కొండలమ్మ తల్లితో పాటు అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో అమ్మవార్లు గాయత్రీ దేవిగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరుని ఆలయంలో అమ్మవారు ధాన్యలక్ష్మీ దేవిగాను, కొతవరం శ్రీ గంగా పార్వతీ సమేత గౌతమేశ్వరాలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండవల్లి, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, భైరవపట్నం, అయ్యవారిరుద్రవరం, అప్పాపురం, లోకుమూడి తదితర గ్రామాల్లో శరన్నవరాత్సోవాలు జరుపుతున్నారు. స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీ మంగళగౌరిగా అమ్మవారు



గుడివాడ విజయదుర్గ దేవస్థానంలో మంగళగౌరిగా అమ్మవారు

గుడివాడ టౌన్: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనానికి ఉంచారు. స్థానిక నీలామహల్ రోడ్‌లోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని శ్రీ మంగళగౌరీ దేవిగా, బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు.

గాయత్రీదేవీ పాహిమాం..

కైకలూరు: దసరా మహోత్సవాలు మంగళవారానికి రెండో రోజుకు చేరాయి. కైకలూరు శ్యామలాంబ అమ్మవారు గాయత్రీదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోలాట ప్రదర్శన, హరికథాగానం, బాలనాగమ్మ పకీరు సీను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. లోకుమూడిగరువు దత్తాశ్రమంలో అమ్మవారు గాయత్రీదేవీగా పూజలు అందుకున్నారు. హరిమోహన్, మురళీకృష్ణ, దుర్గారాజు, మల్యాద్రి ఆర్థికసాయంతో అన్నసమారాధన చేశారు. కైకలూరు వాసవి కన్యకా పరమేశ్వరీ తల్లి గజలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. టపాక, గోనెపాడు గ్రామాల్లో కనక దుర్గమ్మ తల్లి గాయత్రీదేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి దేవీ లలిత సహస్రనామ కుంకుమార్చన చేశారు. ఈఓ కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు



లోకుమూడిగరువు దత్తాశ్రమంలో దసరా పూజలు

కలిదిండిలో..

పడమటిపాలెం గంగానమ్మ గుడిలో దసరా ఉత్సవాలు రెండో రోజుకు చేరాయి. అమ్మవారు గాయత్రీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు.



ఆటపాకలో గాయత్రీదేవీ అవతారంలో అమ్మవారు

వీధి కుక్కలబారి నుంచి రక్షించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పట్టణ ప్రజలు

గుడివాడ టౌన్: పట్టణంలో వీధి కుక్కల దాడులు ఎక్కువయ్యాయని వాటి నుంచి కాపాడాలంటూ పట్టణ ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 10, 11, 12, వార్డులకు చెందిన సభ్యులు మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ ప్రాంతంలో వీధి కుక్కలు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. అవి రాత్రి, పగలు మనుషులపై దాడులు చేస్తున్నాయన్నారు. తమ మూడు వార్డుల్లో అధిక సంఖ్యలో కుక్కలు అధికంగా ఉన్నాయని, వాటి నుంచి తమను కాపాడేతందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



పామర్రు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పామర్రు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ఆదేశాలు వచ్చాయి. పామర్రు నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడిగా ఆరుమళ్ల భగవంత్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఆరుమళ్ల రమాదేవి, రైతు విభాగం అధ్యక్షుడిగా మర్రి బాబూరావు, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కొడాలి సురేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సజ్జా సుబ్రమణ్యం నియమితులయ్యారు. మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అబ్దుల్ అజీజ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా గుర్రం రామచంద్రరావు(ఓనిసిము), స్టూడెంట్స్ వింగ్ అధ్యక్షుడిగా చాట్ల రుత్విక్(కిట్టు), ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా బయవరపు దుర్గాప్రసాద్, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా సూదులగంటి కోటిప్రసాద్, గ్రీవెన్సు సెల్ అధ్యక్షుడిగా పొత్తు బోయిన రామకృష్ణ, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా నీలిశెట్టి శ్రీనివాసరావును నియమించారు. వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా చిరందాసు వెంకట నరసింహ వేణుగోపాలరావు, లీగల్ సెల్ అధ్యక్షుడిగా చిన్నం శ్రీనివాసరావు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా పునుకొల్లు యశ్వంత్ చౌదరి, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా కలకోటి అభినవ్‌రెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా మట్టా ప్రభు, డాక్టర్సు వింగ్ అధ్యక్షుడిగా దిట్టకవి వెంకట శ్రీనివాసాచారి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా నత్తా రవికుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

కైకలూరులో భారీ వర్షం



కైకలూరు తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో చేరిన వర్షం నీరు

కైకలూరు: కైకలూరు నియోజకవర్గంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. కలిదిండి మండలంలో 31.0 మిల్లీ మీటర్లు, మండవల్లి మండలంలో 25.6 మిల్లీ మీటర్లు, కైకలూరులో 16.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో అనేక మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయిన్లు పొంగిపొర్లాయి. కైకలూరులో మెరుపులు, ఉరుములతో ప్రజలను ఆందోళనచెందారు. కాగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సెల్ ఫోన్ మెసేజ్‌లను వాతావరణశాఖ పంపుతోంది.

పౌష్టికాహారం తప్పనిసరి



గుడివాడలో పౌష్టికాహారం తయారు విధానాన్ని చూపిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



పిచుకులపాడులో మాట్లాడుతున్న డాక్టర్ సైరా కటూన్



అడ్డాడలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విజయకుమారి

పమిడిముక్కల: తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని వీరంకిలాకు పీహెచ్‌సీ వైద్యురాలు సైరా కటూన్ తెలిపారు. చోరగుడి సచివాలయం పరిధిలోని పిచుకులపాడు అంగనవాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సైరా మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా సరఫరా చేసే గుడ్లు, బాలామృతం, పాలు గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సలీమున్నీసా, సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, సీహెచ్‌ఓ లక్ష్మీ, సూపర్‌వైజర్ కృష్ణమోహన్, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంటాడలో..

మంటాడ అంగనవాడీ-3 కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. పిల్లలలో ఊబకాయం తగ్గాలంటే నూనె, చక్కెర వాడకం తగ్గించాలని అంగనవాడీ సూపర్‌వైజర్ అనిత తెలిపారు. ఏఎన్‌ఎం లక్ష్మి, అంగనవాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అడ్డాడలో..

అడ్డాడ(పామర్రు): తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా పోషక విలువలు గల ఆహార పదార్థాలనే తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ విజయకుమారి పేర్కొన్నారు. మండలంలోని అడ్డాడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఏఎన్‌ఎం స్వాతి, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ్ మాసోత్సవాలు మంగళవారం కూడా పట్టణంలో జరిగాయి. స్థానిక 11వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమాలను ఐసీడీఎస్ ఏసీడీపీఓ ప్రారంభించారు.

గర్భిణులు, బాలింతలు ఆహార అలవాట్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రత్యేకించి ఐదేళ్లలోపు పిల్లలకు పోషకాహారం ఇచ్చే విషయంపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భవానీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర లేక బెండ రైతుల ఆందోళన

దిగుబడి ఉన్నా..
ఖర్చులు రావటం లేదని ఆవేదన



కొర్నిపాడులో సాగు చేస్తున్న బెండ

పెదపారుపూడి: మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేస్తున్న బెండకు రేటు లేకపోవటంతో నష్టాలు తప్పటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొర్నిపాడు, రావులపాడు, వానపాముల, జమిదింటకుర్రు, గుర్విందగుంట గ్రామాల్లో సుమారు 200 ఎకరాలకుపైగా బెండ సాగును రైతులు చేపట్టారు. చాలా మంది రైతులు భూమిని కౌలు తీసుకుని బెండ సాగు చేస్తున్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో తొలుత రైతులు సంతోషించారు. తీరా కోతకు వచ్చిన సమయంలో ధర లేకపోవటంతో రైతులు డీలాపడిపోయారు. కేజీ బెండ రూ.18 మాత్రమే ధర పలుకుతోంది. కనీసం కూలీల ఖర్చులకు కూడా రావడం లేదని కొర్నిపాడు గ్రామానికి చెందిన బెండ సాగు చేసిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. దిగుబడి ఎక్కువగా ఉండడంతో ఉదయం నుంచి రాత్రి ఏడు గంటల వరకు రైతు బజార్‌లో అమ్మినా కాయలు మిగిలిపోతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎకరా బెండ సాగుకు రూ.90 వేలు

ఎకరా బెండ సాగుకు భూమి కౌలుతోపాటు రూ.90 వేలు ఖర్చు చేసినట్లు రైతులు తెలిపారు. దిగుబడి ఆశాజనకంగా ఉందని పేర్కొన్నారు. రేటు కేజీ బెండకాయలు రూ.18 నుంచి రూ.20 ధర పలకటంతో కూలీ ఖర్చులకు సరిపోవటం లేదని వాపోతున్నారు. రోజుకు 200 కేజీల వరకు బెండకాయల దిగుబడి వస్తోందని తెలిపారు. గుడివాడ రైతుబజార్‌లో అమ్ముతున్నా చాలా వరకు కాయలు మిగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చాలా వరకు బెండకాయలను గేదలకు వేస్తున్నట్లు తెలిపారు.

ధర లేక నష్టాలు తప్పటం లేదు

దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధర లేకపోవటంతో నష్టాలు తప్పటం లేదు. అప్పుల చేసి మరీ సాగు చేశాం. గుడివాడ రైతు బజార్‌లో కిలో రూ.18 మాత్రమే ధర పలుకుతోంది. ఆదాయం సంగతి దేవుడెరుగు.. కనీసం నష్టాలు రాకుంటే చాలు.

– కనుమూరి వరప్రసాద్, బెండ రైతు, కొర్నిపాడు

కూలీల ఖర్చులు రావటం లేదు



ఈ ఏడాది బెండ సాగు చేసిన రైతులు అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావటం లేదు. కేజీ రూ.18 మాత్రమే ధర ఉంటుంది. కనీసం రూ.25 నుంచి రూ.30 ధర ఉంటే బెండ రైతులు నష్టాల నుంచి గటెక్కితారు. రైతుబజార్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మినా కూలీల ఖర్చులు రావటం లేదు.

– మోచర్ల స్వామి, బెండ రైతు, కొర్నిపాడు

శ్రీ కొండలమ్మకు విశేషాభిషేకాలు



హోమం నిర్వహిస్తున్న చైర్మన్ మోహన్, రామరాజు దంపతులు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలోని శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి శ్రీదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం విశేషాభిషేకాలు, హోమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు(మోహన్), సభ్యులు సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు.

ఆలయ మర్యాదలతో స్వాగతం

వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని గుడ్లవల్లేరు జిల్లా సాగునీటి ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సన్మానించి అమ్మవారి చిత్ర పటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలోని శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మచిలీపట్నం శ్రీ బాలా త్రిపుర సుందరీ నృత్య నికేతన్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. షిరిడీ సాయి నాట్య మండలి వారిచే రెండు రత్నములు గయోపాఖ్యానము, శ్రీ రామాంజనేయ యుద్ధం(వార్ సీను) ఘట్టాలు, గుడివాడ శ్రీ జై నాట్య మండలి వారిచే ప్రదర్శించిన శ్రీ వల్లీ కల్యాణం పౌరాణిక నాటకం ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

విజయవాడరూరల్: గ్రామాల్లో వ్యవసాయ పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ క్రాప్ నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రఘురామ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పాతపాడు గ్రామం వచ్చిన సందర్భంగా పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 80 శాతం ఈ క్రాప్ పంట నమోదు జరిగిందని, మిగిలిన 20 శాతం మంది రైతులు కూడా సాగు చేస్తున్న పంటల వివరాలను గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో తెలియచేసి నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో రైతులకు అవసరమైన యూరియా ఎరువు అందుబాటులో ఉందని చెప్పారు.

పారిశుద్ధ్య నిర్వహణపై శిక్షణ



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని కమిషనర్ ఎస్‌కే నజీర్ తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ తాడిగడప మున్సిపాలిటీతో పాటు పలు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం నిర్వహణపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో శిక్షణ కార్యక్రమం నిర్వహించిందన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు, మేస్త్రులకు పనిలో సామర్థ్యం పెంపుపై ఆల్ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ డైరెక్టర్ చలపతిరాజ్ శిక్షణ ఇచ్చారన్నారు. తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించటం, చెత్త నుంచి సంపద తయారీ చేసే విధంగా చర్యలు తీసుకోవటం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరులో మంగళవారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను కూచిపూడి పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు కూచిపూడి ఎస్ఐ కేఎస్ విశ్వనాథ్ తెలిపారు.

విద్యుత్ లైట్లు వెలగక ఇబ్బందులు

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రాత్రి సమయంలో విద్యుత్ లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లోకుమూడి హరిజనవాడ, మండవల్లిలో ఇటీవల కొన్ని రోజుల నుంచి కొన్ని లైట్లు వెలగడం లేదు. ఈ విషయమై సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని అన్ని వీధిలైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు

పామర్రు: ఉంగ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో ఆశ్వీజమాసం తొలి మంగళవారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామికి పంచామృతాలతో అభిషేకాలను చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించామని ఈఓ వర ప్రసాదరావు పేర్కొన్నారు.